RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 245 | సంపుటి 4 | బుధవారం | 27-05-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

మహిళల ఆర్థిక స్వావలంబనను రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన అస్త్రంగా మలిచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు సమాఖ్యలుగానే కాకుండా ఆర్థిక వ్యవస్థను నడిపించే శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మహిళా భవనాలకు వర్చువల్ గా శంకుస్థాపన చేస్తూ మహిళలకు ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మహిళా సంఘాలకు భారీ స్థాయిలో బ్యాంక్ లింకేజీ రుణాలు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, బస్సుల యాజమాన్యం, పెట్రోల్ బంకుల నిర్వహణ, సూపర్ బజార్ల స్థాపన వంటి అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు.



## మహిళా సాధికారతే రాష్ట్రానికి

# బలమైన పునాది

రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మహిళా భవనాలకు వర్చువల్ గా శంకుస్థాపన

- మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత
- మహిళా భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ రుణాల హామీ
- మహిళల కోసం 1,000 బస్సులు, 1,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుల ప్రణాళిక
- మహిళా శక్తి సూపర్ బజార్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్న సీఎం
- ధాన్యం కొనుగోలు నుంచి పెట్రోల్ బంకుల నిర్వహణ వరకు మహిళలకు అవకాశాలు

2

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మహిళలే కీలక భాగస్వాములని, వారి ఆర్థిక సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం తెలంగాణ సచివాలయం వేదికగా ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న 8,000 మహిళా సంఘ భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. కంప్యూటర్ బటన్ నొక్కి ఒకేసారి ఇన్ని వేల భవనాలకు శ్రీకారం చుట్టడం దేశంలోనే ఒక రికార్డు అని, ఇది మహిళల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

**ఉచిత ప్రయాణం నుంచి యజమానులయ్యే వరకు..**

మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించామని సీఎం గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే కోట్లాది మంది మహిళలు లబ్ధి పొందారని, ఇందుకోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 10,000 కోట్లకు పైగా బకాయిలను చెల్లించిందని తెలిపారు.

## సమన్వయంతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం

- బాల్య వివాహాలు శిక్షార్హమైన నేరం : అదనపు కలెక్టర్ ఎన్. రవి హెచ్చరిక
- బాలికల విద్యాభివృద్ధితోనే సామాజిక మార్పు సాధ్యమని సూచన
- బాల్య వివాహాల నివారణలో మత గురువులది కీలక పాత్ర
- గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంక్షేమ శాఖ
- బాల్య వివాహ నిర్మూలన గోడపత్రికల ఆవిష్కరణ
- హాజరైన వారితో నిర్మూలన ప్రతిజ్ఞ చేయించిన అధికారులు

2





## ఏసీబీకి చిక్కిన లంచగొండి తహసీల్దార్

- భూ కన్వర్షన్ కోసం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- శామీర్ పేట తహసీల్ లో ఆకస్మిక దాడులు
- కీలక రికార్డులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టిన అధికారులు
- ఎమ్మార్వో, ఆర్డీవో సహా పలువురు సిబ్బందిని ప్రశ్నించిన ఏసీబీ
- అవినీతి వ్యవహారంపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగింపు

2

## గుడుంబా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

- బజానా తండాలో రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు
- 120 ఇండ్లలో తనిఖీలు.. 15 వాహనాలు గుర్తింపు
- 100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసిన పోలీసులు
- సైబర్ నేరాలు, గంజాయి, రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన
- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచన

04



## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

- కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి సహా ఇద్దరు కీలక నేతలు అదుపులో
- అరెస్టయిన నేతలపై మొత్తం రూ.40 లక్షల రివార్డు
- 2026లోనే 264 మంది మావోయిస్టుల లొంగుబాటు
- భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు
- యువత మావోయిస్టు ప్రభావానికి లోనుకాకూడదని డీజీపీ హెచ్చరిక

04



# మహిళా సాధికారతే రాష్ట్రానికి బలమైన పునాది

**మొదటిపేజీ తరువాయి..**

అయితే మహిళలు కేవలం ప్రయాణికులుగానే మిగిలిపోకూడదని, వారిని బస్సుల యజమానులుగా మార్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని అన్నారు. దీనిలో భాగంగా 1,000 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 కొత్త బస్సులను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.

**ఆర్థిక వెన్నుదన్నుగా బ్యాంక్ లింకేజీ రుణాలు..**

మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని భారీగా పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రూ. 5 లక్షల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దాదాపు రూ. 60 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందించామని, మహిళలు తాము తీసుకున్న రుణాలను అత్యంత నిజాయితీగా తిరిగి చెల్లిస్తున్నారని ఆయన ప్రశంసించారు. మహిళలపై వడ్డీ భారం పడకుండా ఉండేందుకు సున్నా వడ్డీ పథకం కింద ప్రభుత్వం ఇప్పటికే రూ. 1,390 కోట్లు విడుదల చేసిందని వివరించారు.

**పారిశ్రామిక రంగానికి మహిళా శక్తి..**

మహిళలు కేవలం కుట్టు మిషన్లు, అప్పడాల తయారీ వంటి చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా, పెద్ద ఎత్తున పరిశ్రమలను స్థాపించాలని సీఎం పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, పెద్ద పెద్ద గోదాములు, లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. అటువంటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం 100 ఎకరాల వరకు భూమిని కేటాయించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అంతేకాకుండా, భవిష్యత్తులో మహిళా సంఘాలే నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, బియ్యాన్ని ప్రభుత్వానికి సరఫరా చేసే విప్లవాత్మక విధానాన్ని తీసుకొస్తామని ఆయన వెల్లడించారు.

**కార్పొరేట్ సంస్థలకు దీటుగా సూపర్ బజార్లు..**

మార్కెటింగ్ రంగంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ 'మహిళా శక్తి సూపర్ బజార్లను' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సూపర్ బజార్లు డీమార్ట్, బిగ్ బజార్ వంటి కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన వస్తువులను విక్రయించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఈ బజార్ల నిర్వహణ కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు లీజుకు ఇస్తామని తెలిపారు. ఈ వ్యాపారాల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంటూ మహిళలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా మహిళలను భాగస్వాములను చేస్తూ 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను, పెట్రోల్ బంకుల నిర్వహణను మహిళా సంఘాలకే అప్పగిస్తామని చెప్పారు.

**నాణ్యమైన ఇందిరమ్మ చీరల పంపిణీ..**

గత ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన చీరల నాణ్యతపై విమర్శలు వచ్చాయని, కానీ తమ ప్రభుత్వం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా 'ఇందిరమ్మ చీరలను' ఆడబిడ్డలకు సారెగా అందిస్తోందని సీఎం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని పేద మహిళలందరికీ ఈ చీరలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.




# పది రోజుల్లో నాలుగు సార్లు బాదుడు

- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై 'న్యూ డెమోక్రసీ' ఆగ్రహం
- ట్రాక్టర్లను తాళ్లతో లాగుతూ వినూత్న రీతిలో నిరసన
- ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్

**గార్ల, మే 26 (ప్రభాత గమనం) :**

దేశంలో ఇంధన ధరల పెరుగుదల సామాన్యులు, రైతుల పాలిట శాపంగా మారింది. గత పది రోజుల్లోనే నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచిందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి. సక్రు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలంటూ మంగళవారం గార్ల మండల కేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో రైతులు, కార్యకర్తలు వినూత్న నిరసన చేపట్టారు. డీజిల్ ధరల పెరుగుదలకు నిరసనగా ట్రాక్టర్‌కు తాళ్లు కట్టి చేతులతో లాగుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి జి. సక్రు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ వైఫల్యాలు, చమురు దిగుమతులపై సమయానుకూలంగా సరైన నిర్ణయాలు తీసుకోకపోవడమే నేటి ఇంధన సంక్షోభానికి కారణమని మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశంలో పుష్కలంగా చమురు నిలువలు ఉన్నాయని చెప్పిన ప్రధాని, ఎన్నికలు ముగియగానే వరుసగా ధరలు పెంచడం విచిత్రంగా ఉందన్నారు. సామాన్యులపై మోయలేని భారంగా మారిన ఈ ధరల పెంపును మోడీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఇంధన ధరల విపరీతమైన పెంపు వల్ల అన్ని రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఏర్పడిందని సక్రు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంటల సాగులో రైతులు ఆధునిక వ్యవసాయ పరికరాలకు, ట్రాక్టర్లకు డీజిల్‌ను విరివిగా వినియోగిస్తారని.. ఇప్పటికే పంటలకు సరైన మద్దతు ధరలు రాక ఇబ్బంది పడుతున్న అన్నదాతకు ఈ ధరల పెంపు గోరుచుట్టుపై రోకటిపోటులా మారిందన్నారు. రవాణా రంగంపై దీని ప్రభావం గణనీయంగా పడటంతో, గత వారం రోజులుగా నిత్యవసర సరుకులు, ముఖ్యంగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధరలు మరింత పెరిగితే సామాన్యులు, ఉద్యోగులు, యువత బతికే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని, లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ గార్ల మండల నాయకులు గౌని భద్రయ్య, ఎర్రి రవి, మాలోత్ మాన్య, సూత్రపు మనోహర్, మట్టపల్లి వీరభద్రం, చింతల గురవయ్య, తాళ్లూరి లక్ష్మీ నరసయ్య, సురేష్, రవి, విశ్వనాథం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు.

# డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- మాదకద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్
- డ్రగ్స్ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం

**హనుమకొండ, మే 26, ప్రభాత గమనం:**

సమాజానికి మహమ్మారిగా మారుతున్న మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో మరింత విస్తృతంగా చైతన్యం తీసుకురావాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలు ఎలా దెబ్బతింటాయో వివరించాలని సూచించారు. సమాజంలో మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో "ప్రహరి క్లబ్బులు" ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, పరకాల ఆర్డీవో వెంకన్న, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు డీఎంహెచ్ఓ మదన్మోహన్ పాల్గొన్నారు.





# సమన్వయంతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం

- బాల్య వివాహాలు శిక్షార్హమైన నేరం: అదనపు కలెక్టర్ ఎన్. రవి
- మత గురువులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచన
- బాల్య వివాహ నిర్మూలన గోడపత్రికల ఆవిష్కరణ

**హనుమకొండ, మే 26, ప్రభాత గమనం :**

సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేస్తేనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాల్య వివాహ నిషేధ చట్టం–2006", "బాల్య వివాహ ముక్త్ భారత్" అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు ఇంకా అనేక అసమానతలకు గురవుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులు మారాలంటే బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆడపిల్లలపై వివక్ష లేకుండా, బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బాల్య వివాహాల నివారణలో మత గురువులది కీలక పాత్ర అని, సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం ఉన్నందున ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ముందుండాలని సూచించారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం–2006 ప్రకారం బాల్య వివాహం శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇటువంటి వివాహాల్లో ఏ రూపంలోనైనా పాల్గొనడం, సహకరించడం లేదా సేవలు అందించడం వల్ల గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో మత పెద్దలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నివారణలో ఈ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బాల్య వివాహ నిర్మూలన కోసం రూపొందించిన గోడపత్రికలను అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆవిష్కరించారు. అనంతరం హాజరైన వారితో బాల్య వివాహ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు.



# ఏసీబీకి చిక్కిన లంచగొండి తహసీల్దార్

**హైదరాబాద్, మే26(ప్రభాత గమనం):**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు. అనంతరం మీడియాతో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని, ఎమ్మార్వో సుచరితతో పాటు ఆర్డిఓ కీసర రాజేష్ పలువురు సిబ్బందిని విచారిస్తున్నామని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న

**హనుమకొండ, ప్రభాత గమనం:**

పరకాల నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ వెంకన్న సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకన్న జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి నూతన బాధ్యతలు స్వీకరించిన వెంకన్నకు అభినందనలు తెలియజేసి, విధుల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# ఘనంగా గుండా వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు

- హాజరైన ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ డానియల్
- అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య కేక్ కట్ చేసిన వెంకట్ రెడ్డి

**గార్ల, మే (ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజానేత గుండా వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు గార్ల మండలంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గుండా వెంకట్ రెడ్డి నివాసంలో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యకర్తల కోలాహలం, నినాదాల మధ్య గుండా వెంకట్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గార్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించి, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ డానియల్ మిత్ర, గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దనియకుల రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మండ రాము, శంషాద్ బేగం ప్రత్యేకంగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో గార్ల మండల సర్పంచులు మోతీలాల్, రమేష్, బాబూరావు, వెంకట్రావు, భద్రులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హతిరం, వెంకటేశ్వర్లు, రవి, మోహిన్, ప్రశాంత్, మీరా పటాన్, పాషా, రాజీవ్, బాబూలాల్, రాజశేఖర్, హరీష్, నాగేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే TPCC సోషల్ మీడియా గార్ల మండల కో–ఆర్డినేటర్ గుడిచుట్టు నవీన్ యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలతో గుండా వెంకట్ రెడ్డి నివాస పరిసర ప్రాంతాలు కాంగ్రెస్ శ్రేణుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించాయి.



# సామాజిక సేవలో తగ్గేదెలే..






- ఆశా దీపానికి అండగా సమ్మి గౌడ్..
- స్వరూప కుటుంబానికి భరోసానిచ్చిన ఫౌండేషన్ అధినేత..
- ఆయన సేవా స్ఫూర్తికి సలాం..



**కేసముద్రం, మే26(ప్రభాత గమనం):**

సామాజిక సేవా కార్యక్రమాలలో తగ్గేదేలే అంటున్న సమ్మిగౌడ్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మన్న. రోజురోజుకు తన సేవా కార్యక్రమాలను విస్తరిస్తూ దూసుకెళ్తున్నారు. ఆపదలో అన్నా అంటే నేనున్నానంటూ నిరుపేద కుటుంబాలకు భరోసానిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆశా వర్కర్ ను స్వయంగా తన ఇంటికి పరామర్శించారు. కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామానికి చెందిన ఆశా వర్కర్ స్వరూప ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఫౌండేషన్ అధినేత సమ్మి గౌడ్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల శస్త్రచికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న స్వరూప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వరూప భర్త నాగెల్లి రాజయ్య, పిల్లలు వంశితేజ, ఇంద్రతేజ, కుటుంబ సభ్యులు నాగెల్లి జనార్ధన్ – రమలను కలిసి ఓదార్చారు.వారి "కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అంటూ భరోసా ఇచ్చారు. ఆయన చూపిన మానవత్వానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మి గౌడ్ మాట్లాడుతూ.."గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎండనకా, వాననకా సేవలు అందించే ఆశా వర్కర్లు నిజమైన ఆరోగ్య యోధులని కొనియాడారు. ప్రతి ఇంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులకు అంకితభావంతో సేవలందించే స్వరూపలాంటి కార్యకర్తలు సమాజానికి ఆదర్శమని తెలిపారు. ఆమె త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాని తెలిపారు. సామాజిక సేవలను తన బాధ్యతగా భావిస్తున్న సమ్మి గౌడ్ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయం చేయడం, విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. అవసర సమయంలో ప్రజలకు తోడుగా నిలుస్తూ మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నారని స్థానికులు కొనియాడుతున్నారు. ఆశ కార్యకర్త స్వరూప చేసిన సేవలను గ్రామస్తులు గుర్తుచేసుకుంటూ, ఆమె త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆమె పాత్ర చిరస్మరణీయమని పలువురు అభిప్రాయపడ్డారు.



## నెక్కొండ వాసికి చరిత్ర విభాగంలో డాక్టరేట్

నెక్కొండ మే26(ప్రభాత గమనం):రెవెన్యూ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోడా వీరు భాయ్ హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో డాక్టరేట్ పట్టా లభించింది. బోడా రెడ్యా, బోడా బాలమ్మ దంపతుల కుమారుడైన వీరు భాయ్ ప్రస్తుతం మెదక్ జిల్లాలో స్థానికేతర కోటా కింద ప్రభుత్వ ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్నారు. విద్యారంగంలో విశేష ప్రతిభ కనబరిచిన ఆయన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష, తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష, ఆంధ్రప్రదేశ్ సహాయ ఆచార్యుల అర్హత పరీక్ష, తెలంగాణ సహాయ ఆచార్యుల అర్హత పరీక్ష, జాతీయ స్థాయి అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2017 డిగ్రీ కళాశాల అధ్యాపకుల నియామక పరీక్షలో అర్హత సాధించి ముఖాముఖికి ఎంపికయ్యారు. అదేవిధంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన 2024 జూనియర్ అధ్యాపకుల పరీక్షలో కూడా అర్హత సాధించి ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికయ్యారు. ఆయన 2020–21 విద్యా సంవత్సరంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో నిర్వహించిన పరిశోధక విద్యార్థుల ప్రవేశాలలో మొదటి ర్యాంక్ సాధించి సీటు పొందారు. అనంతరం తెలంగాణలో గిరిజన సమస్యలు (1956–1996) అనే అంశంపై ఆచార్య జి. దయాకర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, ఇటీవల నిర్వహించిన మౌఖిక పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణులై డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, అధ్యాపకులు మరియు గ్రామస్తులు బోడా వీరు భాయ్‌ను అభినందించారు.



## క్రీస్తు అంటేే ప్రేమ.. శాంతి.. క్షమించే హృదయం

- బ్రదర్ డబ్ల్యూ సీఎం కిరణ్ పాల్..

**కేసముద్రం మే26(ప్రభాత గమనం):**

క్రీస్తు శాంతి మహోత్సవం, కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో హరిహర గార్డెన్లో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డబ్లు సీఎం, బ్రదర్ కిరణ్ పాల్ పాల్గొని క్రైస్తవులకు క్రీస్తు శాంతి సందేశంలో మాట్లాడారు..ఏసుక్రీస్తు ప్రభువు అంటేనే, ప్రేమ శాంతి క్షమించే హృదయం, ఆయనను వెంబడించే ప్రతి ఒక్కరు సమాజంలో తోటి వారి పట్ల నీ ప్రేమను వ్యక్తపరచాలని తెలిపారు. నీ ద్వారా ఇతరులకు మేలు కలిగేలా మీ ప్రవర్తన ఉండాలని, క్రీస్తు సిలువ మరణం ప్రపంచానికి రక్షణ మార్గంగా మారిందని,ఆయన రక్తంలో పాపక్షమాపణ రక్షణ ఉందని పేర్కొన్నారు. అన్ని మతాల సంస్కృతిని గౌరవించాలని సూచించారు.అనంతరం పిజెఎఫ్ మహబూబాద్ బ్రదర్ లివింగ్ వాటర్, జాన్ మహబూబ్ అధ్యక్షతన కేమండల పాస్టర్ ఫెలోషిప్, సిజేఏసీ, పరలోక ప్రార్థన సాహసం కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్,మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు వల్లందాస్ సుధాకర్, పిల్లి కుమారస్వామి, పరలోక ప్రార్థన సాహవాస అధ్యక్షులు బనిశెట్టి వెంకటేష్, ప్రభు జీవన్,రూబెన్ పాల్, ఇజ్రాయిల్, జోసెఫ్ సురేష్, పృధ్విరాజ్, విక్టరీ పాల్, లాల్ సింగ్,పుల్లెంలో శ్రీధర్,జోసెఫ్, లాజరస్ గౌడ్, మోజెస్, రాజు,అన్ని డినామినేషన్ల చర్చిల విశ్వాసులు పాల్గొన్నారు.



## ఫారెస్ట్, అసైన్డ్ భూ సమస్యలను పరిష్కరించాలి

- అర్హులైన రైతులందరికీ కచ్చితంగా న్యాయం జరుగుతుంది
- మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్

**మహబూబాబాద్, మే26(ప్రభాత గమనం):**

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ, అసైన్డ్ వ్యవసాయ భూముల పరిష్కార సమన్వయ సమావేశం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ లఅధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్ , తహసిల్దార్లు, ఏడి సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ...మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ అసైన్డ్ భూ సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పరిష్కరించాలని తద్వారా పేద ప్రజల మనసుల్లో అధికారులు ఉంటారని తెలిపారు, అందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. జెన్ సిపాయి భూములు మొదటి వార్ లో తరతరాల నుండి వారికి వచ్చాయని , అట్టి మండలాలు నెల్లికుదురు, నరసింహ గూడెం సుమారు 250 ఎకరాలు ఉంటాయన్నారు. అలాగే సీతానగారం, గుండెంగా, ముడుపుగల్, నారాయణపురం, నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి చిన్న చిన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టులో ఉన్న భూ సమస్యల కోసం కలెక్టర్ హైదరాబాద్ స్థాయి, భూ పరిపాలన కమిషనర్ గారిచే చర్చించి ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన నిరుపేద వారికి అందించాలని ఆయన కోరారు. గతంలో రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని నిజమైన లబ్ధిదారులు ప్రస్తుతం ఉన్నారని వారిని మాత్రమే గుర్తించాలని, పేద ప్రజలకు సహాయం చేస్తే ఉద్యోగ తృప్తి లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు.పని ఒత్తిడి ఉన్న గాని ప్రత్యేకంగా ఈ భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి,రెవెన్యూ, సర్వే సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## భువనగిరిలో బెల్లి లలితక్క వర్ధంతి

- నివాళులర్పించిన టీఆర్పీ రాష్ట్ర నాయకులు
- లలితక్క ఆశయ సాధనతోనే బీసీ రాజ్యాధికారం సాధ్యమన్న నేతలు



**భువనగిరి, మే26(ప్రభాత గమనం):**

తెలంగాణ తొలిదశ ఉద్యమ గర్జన, సబ్బండ వర్గాల సాంస్కృతిక సారథి, అమరవీరురాలు బెల్లి లలిత (తెలంగాణ గానకోకిల) వర్ధంతి సందర్భంగా భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని లలితక్క చిత్రపటానికి పూలమాలలు వేసి, అమరవీరులకు స్మరిస్తూ జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మాట్లాడుతూ.. పాలక వర్గాల గుండెలు అదిరిపోయేలా నిప్పులు చెరిగారు.ఒక బెల్లి లలిత గొంతు కోస్తే తెలంగాణ పాట ఆగిపోతుందని భ్రమపడ్డ నాటి అరాచక పాలకులు, హంతక ముఠాలు నేడు కాలగర్భంలో కలిసిపోయాయని తెలిపారు. కానీ లలితక్క పాడిన ప్రతి అక్షరం ఇవాళ కోట్ల మంది బహుజనుల గుండెల్లో విప్లవ జ్వాలగా ఎగసిపడుతోందన్నారు. ఆమె శరీరాన్ని 17 ముక్కలు చేసినా, ఆ ముక్కల నుండి వేలాది మంది ఉద్యమకారులు పుట్టుకొచ్చారని తెలిపారు. తెలంగాణ తెచ్చుకున్నా బడుగు, బలహీన వర్గాలకు ఒరిగింది ఏమీ లేదు. లలితక్క కలలుగన్న సామాజిక తెలంగాణ, సబ్బండ వర్గాల రాజ్యాధికారం సాధించే వరకు మా తెలంగాణ రాజ్యాధికార పార్టీ విశ్రమించదని పేర్కొన్నారు. ద్రోహుల గుండెల్లో నిద్రపోతాం అన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వనజ పటేల్ మాట్లాడుతూ.. లలితక్కను చంపిన శక్తులపై తీవ్రస్థాయిలో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు బెల్లి లలిత కేవలం ఒక గాయని కాదని, అణగారిన వర్గాల ఆయుధ అని తెలిపారు. భువనగిరి ఫ్లోరైడ్ రక్కసిపై, భూస్వాముల అరాచకాలపై గర్జించిన వీరనారని కొనియాడారు. ఒక బహుజన మహిళ ప్రశ్నించే స్థాయికి ఎదిగితే ఓర్వలేక పాశవికంగా హతమార్చారని తెలిపారు. లలితక్కను భౌతికంగా చంపినా, ఆమె ఇచ్చిన పోరాట స్ఫూర్తిని చంపలేరని తెలిపారు. ఇవాళ తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై, హక్కుల కోసం లలితక్క స్ఫూర్తితో మహిళా లోకం తిరగబడాలన్నారు. నాడు లలితక్కను పొట్టనబెట్టుకున్న శక్తులకు, నేటి అరాచక పాలకులకు బీసీ మహిళల చేతిలో దిమ్మతిరిగే రోజులు దగ్గరపడ్డాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజని కుమార్ యాదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మరియు రాష్ట్ర నాయకులు, మహిళా నాయకురాలు, వివిధ అనుబంధాల సంఘాల నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మోటార్లకు మీటర్లు నిలువు దోపిడే

- నాడు ఎదిరించిన కేసీఆర్..నేడు లొంగిపోతున్న రేవంత్ సర్కార్?
- ప్రభుత్వంపై బీఆర్ ఎస్ నేత శీలంశెట్టి రమేష్ విమర్శలు
- పల్లెల్లోకి వస్తే తిరగబడతామని హెచ్చరిక



**గార్ల, మే 26 (ప్రభాత గమనం) :**

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల సాకుతో రాష్ట్రంలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం తెలంగాణ రైతాంగంపై జరుగుతున్న నిలువు దోపిడీ అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అనేది కేవలం సాంకేతిక ప్రక్రియ కాదని, దశాబ్దాలుగా రైతులు అనుభవిస్తున్న ఉచిత విద్యుత్ హక్కుకు చరమగీతం పాడే ఒక పక్కా వ్యూహాత్మక కుట్ర అని ఆయన ఆరోపించారు. మంగళవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విధానం వెనుక ఉన్న ప్రమాదాలను, ఆర్థిక భారాలను వివరంగా ఎండగట్టారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇదే కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్ (RDSS) పథకం కింద వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెట్టాలని తీవ్ర ఒత్తిడి తెచ్చిందని రమేష్ గుర్తుచేశారు. మీటర్లు పెడితేనే రాష్ట్రానికి అదనపు అప్పుల పరిమితి (FRBM) కింద రూ. 25,000 కోట్లు ఇస్తామని కేంద్రం ఆశ చూపిందని, కానీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు "రూ. 25 వేల కోట్లు పోయినా పర్వాలేదు.. నా తెలంగాణ రైతన్నల బావుల వద్ద మీటర్లు పెట్టనిచ్చి వారి మెడకు ఉరితాడు వేయనివ్వను" అని కేంద్రంపై తిరగబడ్డారని కొనియాడారు. కానీ నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆనాటి పట్టుదలను పక్కనబెట్టి, రైతుల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టాలని చూడటం అత్యంత దుర్మార్గమన్నారు.స్మార్ట్ మీటర్ల అసలు నైజం 'ప్రీ-పెయిడ్' విధానమేనని, మొబైల్ రీఛార్జ్ లాగా ముందే డబ్బులు కడితేనే మోటారు నడుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "వాతావరణం బాగోకనో, పంట చేతికి రాకనో రైతు దగ్గర డబ్బుల్లేకపోతే.. చేతికొచ్చిన పంట ఎండిపోవాల్సిందేనా?" అని ప్రశ్నించారు. ఇది ఉచిత విద్యుత్ పరిధిని క్రమంగా కుదించి, భవిష్యత్తులో దాన్ని పూర్తిగా ఎత్తివేయడానికేనని ఆరోపించారు. ఒక్కో స్మార్ట్ మీటర్ కొనుగోలు, అమరిక మరియు 4G/5G నెట్‌వర్క్ నిర్వహణకు వేల రూపాయల ఖర్చవుతుందని, ప్రాథమిక సబ్సిడీ తర్వాత ప్రతి నెల మీటర్ సర్వీస్ ఛార్జీల పేరుతో రైతుల నుంచే వసూలు చేయడానికి డిస్కంలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని మండిపడ్డారు.భూగర్భ జలాలు పడిపోయినప్పుడు రైతులు అవసరాన్ని బట్టి 5HP మోటార్ల స్థానంలో 7.5HP లేదా 10HP మోటార్లను వాడుతుంటారని, స్మార్ట్ మీటర్లు వస్తే అనుమతించిన లోడ్ కంటే ఒక్క పాయింట్ ఎక్కువ వాడినా కరెంట్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుందని లేదా భారీగా పెనాల్టీలు పడతాయని హెచ్చరించారు. డిస్కంల నష్టాలకు ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన వేల కోట్ల బకాయిలు, విద్యుత్ కొనుగోళ్లలో జరిగే అవినీతే కారణమని.. వాటిని సరిదిద్దకుండా నష్టాలన్నింటినీ రైతుల ఖాతాలోకి నెట్టేందుకే ఈ సంస్కరణల ముసుగు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నాటి కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగం కోసం రూ. 25 వేల కోట్ల కేంద్ర నిధులనే వదులుకుంటే.. నేటి రేవంత్ ప్రభుత్వం ఏ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ స్మార్ట్ మీటర్ల విధానానికి మోకరిల్లుతోంది?" అని శీలంశెట్టి రమేష్ ప్రశ్నించారు.వ్యవసాయ రంగాన్ని RDSS పరిధి నుంచి పూర్తిగా మినహాయించాలి. వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచనను ప్రభుత్వం బేషరతుగా వెనక్కి తీసుకోవాలి.గతంలో సాధించుకున్న నిరంతర ఉచిత విద్యుత్ హక్కును ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనసాగిస్తామని ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా లిఖితపూర్వక హామీ ఇవ్వాలి. గార్ల మండల పరిధిలోని రైతు లోకమంతా ఏకతాటిపై ఉందని, మీటర్లు పట్టుకుని ఏ అధికారి అయినా గ్రామాల్లోకి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రైతుల పొలాల వద్దకు మీటర్లు వస్తే.. తాము ప్రభుత్వాల గుమ్మాల ముందు ఉద్యమాలకు దిగుతామని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# గుడుంబా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం

- బజానా తండాలో రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు
- 120 ఇండ్లలో తనిఖీలు.. 15 వాహనాలు గుర్తింపు
- 100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసిన పోలీసులు
- సైబర్ నేరాలు, గంజాయి, రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన
- అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచన

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ముమ్మరంగా "కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు సుమారు 120 ఇండ్లు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించారు. అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, 20 కిలోల పట్టిక, 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ అంజలి తెలిపారు. తనిఖీల అనంతరం గ్రామస్తులను సమీకరించిన సీఐ అంజలి దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈతకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్, ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వడదెబ్బతో జీపీ కార్మికుడు మృతి

- రమేష్ అకాల మరణంతో దుబ్బ తండాలో విషాదం
- ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు

గార్ల, మే 26 (ప్రభాత గమనం) :

రాష్ట్రంలో ఎండల తీవ్రత ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. అత్తగారింటికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరిన ఒక వ్యక్తి వడదెబ్బ తగిలి మార్గమధ్యంలోనే మృతి చెందిన విషాద సంఘటన గార్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గార్ల సబ్ ఇన్స్పెక్టర్ బి. సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ఖమ్మం జిల్లా, సింగరేణి మండలం, దుబ్బ తండా గ్రామానికి చెందిన బానోతు రమేష్ (42) గ్రామ పంచాయతీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, రమేష్ తన అత్తగారింటికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరాడు. అయితే ప్రస్తుత ఎండ తీవ్రతకు పుల్లూరు గ్రామ శివారుకు చేరుకోగానే ఆయన తీవ్రమైన వడదెబ్బకు గురయ్యాడు. ఎండ వేడిని తట్టుకోలేక అక్కడే ఉన్న ఒక రైస్ మిల్లు సమీపంలో కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు.రమేష్ మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుడి భార్య బానోతు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గార్ల పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఎస్ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికుడిగా సేవలందిస్తున్న రమేష్ అకాల మరణంతో దుబ్బ తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళేశ్వరంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహం చట్టవిరుద్ధమని, ఇది పిల్లల హక్కులను ఉల్లంఘించే సామాజిక దురాచారమని తెలిపారు. పిల్లలకు విద్య, ఆరోగ్యం మరియు సురక్షితమైన భవిష్యత్తు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చట్ట ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరగాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు, చదువు నిలిచిపోవడం, గృహ హింస మరియు పేదరికం పెరిగే ప్రమాదం ఉందని వివరించారు. భారతదేశంలో అమల్లో ఉన్న "బాల్య వివాహాల నిషేధ చట్టం–2006" ప్రకారం బాల్య వివాహాలు నిర్వహించిన వారిపై రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.1,00,000 వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 1098 చైల్డ్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి,భరోసా ఎస్ఐ స్వప్న కుమారి,సీడీపీఓ,అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు మరియు పురుషులు పాల్గొన్నారు.



# గంజాయి అనుమానిత ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు..

- కేసముద్రాన్ని జల్లడపడుతున్న పోలీసులు...
- నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్"తో గ్రామ శివార్లలో ముమ్మర తనిఖీలు
- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై క్రాంతి సూచన
- గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి
- సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ
- మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని పోలీసుల పిలుపు

కేసముద్రం, మే26(ప్రభాత గమనం):

జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ప్రత్యేక కూంబింగ్ మరియు తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. కేసముద్రం ఎస్సై కే. క్రాంతి కిరణ్, ఎస్.ఐ నరేష్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్", డాగ్ హ్యాండ్లర్ శివరాజ్, పోలీస్ సిబ్బంది కలిసి గ్రామ శివారు ప్రాంతాలు, చెట్ల పొదలు, నిర్మానుష్య ప్రదేశాలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, యువత గుమికూడే ప్రాంతాలు అలాగే గంజాయి సేవిస్తున్న అనుమానిత ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.శబరీష్ సందేశానుసారం ఎస్ఐ క్రాంతి మాట్లాడుతూ... "గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. క్షణికానందం కోసం భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని తెలిపారు. యువత చదువు, ఉద్యోగం, క్రీడలు మరియు మంచి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే ఈ నెంబర్ కు 8712656999 సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.కేసముద్రం పరిధిలో మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, గంజాయి సేవిస్తూ లేదా విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి కుటుంబ సభ్యుల ఆశలను నిలబెట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించాలి

- సోదరభావంతో జరుపుకుని సమాజంలో ఐక్యతను చాటాలి
- కేయూ ఇన్ స్పెక్టర్ రవికుమార్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



బక్రీద్ పండుగను ప్రశాంత, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కోరారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణపై కమ్యూనిటీ నాయకులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ మతాలు, వర్గాలకు చెందిన నాయకులు పాల్గొని బక్రీద్ పండుగ ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పండుగను సోదరభావంతో జరుపుకుని సమాజంలో ఐక్యతను చాటాలని పోలీసులు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని అధికారులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమ్యూనిటీ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కమ్యూనిటీల ప్రతినిధులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

- కేంద్ర కమిటీ సభ్యుడు నరహరి సహా ఇద్దరు కీలక నేతలు అదుపులో
- అరెస్టయిన నేతలపై మొత్తం రూ.40 లక్షల రివార్డు
- 2026లోనే 264 మంది మావోయిస్టుల లొంగుబాటు
- భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు
- యువత మావోయిస్టు ప్రభావానికి లోనుకాకూడదని డీజీపీ హెచ్చరిక

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :


తెలంగాణ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన ఇద్దరు కీలక నాయకులను అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. బీజేఎస్ఏసీ కార్యదర్శి, సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ 'విశ్వనాథ్' అలియాస్ 'సత్య'తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యురాలు మేడర దానమ్మ అలియాస్ 'పూనం' అలియాస్ 'జోజా'లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. డీజీపీ వివరాల ప్రకారం, 2026 సంవత్సరంలో తెలంగాణ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ల ఫలితంగా ఇప్పటివరకు 264 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అలాగే 238 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 3 మంది కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 24 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన ఆపరేషన్లలో ఏకే–47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్‌లు, పిస్టల్స్, బీజీఎల్ గన్స్ సహా మొత్తం 334 ఆయుధాలను 2024 నుంచి 2026 మధ్య భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. అరెస్టయిన పసునూరి నరహరి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడిగా, 1980ల నుంచి మావోయిస్టు ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఆయన పార్టీ టెక్నికల్ విభాగం, సరఫరా విభాగం, ఆయుధ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన నరహరి, బీజేఎస్ఏసీ కార్యదర్శిగా కూడా వ్యవహరించినట్లు తెలిపారు. ఇక మేడర దానమ్మ అలియాస్ పూనం గుంటూరు జిల్లాకు చెందినదిగా, బీజేఎస్ఏసీలో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేసిందని పోలీసులు వెల్లడించారు. 2004 నుంచి నక్సల్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆమె, దండకారణ్యంతో పాటు జార్ఖండ్ ప్రాంతాల్లో కూడా పనిచేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టయిన ఇద్దరి వద్ద నుంచి రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు సమాచారం. కేంద్ర కమిటీ సభ్యుడు నరహరిపై రూ.20 లక్షలు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దానమ్మపై రూ.20 లక్షల రివార్డు ప్రకటించబడినట్లు వెల్లడించారు. మావోయిస్టులు అమాయక గిరిజనులను తుపాకులు, రాకెట్లు, బూబీ ట్రాప్స్ తయారీలో వినియోగిస్తున్నారని, యువత తప్పుదారి పట్టకుండా జాగ్రత్త పడాలని డీజీపీ సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి..

- వంగపహాడ్ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహణ
- విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో దాడి
- రూ.8,230 నగదు, 52 పేకముక్కలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- ఒకరు పరార్.. ఆరుగురిపై కేసు నమోదు
- అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు హసన్‌పర్తి ఎస్సై పి. గోవర్ధన్ ఆధ్వర్యంలో సిబ్బంది కరుణాకర్, దేవేందర్, మహేందర్‌లతో కలిసి మంగళవారం వంగపహాడ్ గ్రామంలోని ముస్కు రజనీకాంత్ ఇంటి ముందు ఖాళీ ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించగా, పోలీసులు చేరుకున్న వెంటనే ఒకరు పరారయ్యారు. మిగతా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో చంద్రకాంత్, తాళ్లపల్లి సురేష్, ముస్కు సురేష్, బోట్ల దివాకర్, ఉడుత రవి, మునుకుంట్ల నాగరాజు ఉన్నారు. పరారైన వ్యక్తిని ముస్కు రజనీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ.8,230 నగదు, 52 పేక ముక్కలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పేకాట, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పొగాకు ఉత్పత్తులు, అక్రమ ఇసుక రవాణా, దొంగతనాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఇటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని హసన్‌పర్తి పోలీసులు కోరారు.




Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374